క్లుప్తంగా

అనధికార హాకర్ల తరలింపు



అనుమానితులను తిరుపతికి తరలిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

తిరుమల : తిరుమలలోని అనధికార హాకర్లను తిరుపతికి పోలీసులు, విజిలెన్స్ అధికారులు తరలిస్తున్నారు. సాక్షి పత్రికలో ఈ నెల 21వ తేదీన ×ఇల వైకుంఠపురం.. ఇదేం అపచారం॰ శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగి తిరుమలలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు 71 మంది అనధికార హాకర్లు, కూలీలు, ఇతర అనుమానితులను గుర్తించి తిరుపతికి పంపేశారు. ప్రతి ఒక్కరి గుర్తింపు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరిలో ఎవరైనా పాత నేరస్తులు ఉన్నారా అని తనిఖీ చేశారు. ఆదివారం ఈ మేరకు తిరుమలలోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వద్ద తాత్కాలిక షెడ్లను తొలగించారు.

ఎర్రావారిపాళెం ఎస్ఐ బదిలీ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజక వర్గం ఎర్రావారిపాళెం ఎస్ఐ ఎర్రిస్వామి బదిలీపై కర్నూలుకు వెళ్లారు. కూటమి నేతల ఒత్తిడిని భరించలేకే ఆయన బదిలీ చేయించుకున్నట్లు స్థానికులు చర్చించుకుంటుండడం గమనార్హం.

నేడు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

తిరుపతి సిటీ: ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ కల్చరల్ అఫైర్స్, సెట్విన్ కోఆర్డినేటర్స్ డాక్టర్ పత్తిపాటి వివేక్, మోహన్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం 'వ్యక్తిత్వ వికాసం' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎస్వీయూలోనూ, పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు వేదికలపై జరగనున్న కార్యక్రమానికి సైకాలజిస్టులు, వర్సిటీ వీసీలు, శ్యాప్ చైర్మన్ హాజరు కానున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

భాకరాపేట: మండలంలోని నెరబైలు పంచాయతీ పాతతురకపల్లి మసీదులో వైఎస్సార్‌సీపీ నాయకులు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు పాతతురకపల్లి మసీదులో ప్రార్థనలు చేసుకున్న తరువాత నెరబైలు వైఎస్సార్‌సీపీ నాయకుడు హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత చెంగల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దేపట్ల నాగార్జున రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ దేవేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

పద్మావతీ అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుపతి రూరల్ : తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని సినీనటుడు సుమన్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న ముఖమండపంలో వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు.

జల్లెడ పడుతున్న పోలీసులు

- నగరం శివారు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- వెంకటాద్రి నగర్‌లో కార్డన్- సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన పోలీసులు
- అనుమానిత వ్యక్తుల వివరాలు, ఆధారాల సేకరణ



వెంకటాద్రి నగర్ అపార్ట్‌మెంట్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట పంచాయతీ పరిధిలోని వెంకటాద్రి నగర్‌లో పోలీసులు ఆకస్మికంగా 'కార్డన్- సర్చ్' ఆపరేషన్ నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకే కాలనీ వద్దకు చేరుకున్న పోలీసులు ఉదయం 5 గంటల నుంచి ప్రతి ఇంటినీ తలుపు తట్టి ఇంటిలో ఎంత మంది బస చేస్తున్నారు ? ఏ పనులు చేస్తున్నారు ? ఎంతకాలం నుంచి కాపురం ఉంటున్నారు తదితర వివరాలను సేకరించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చంద్రగిరి డీఎస్పీ బేతపూడి ప్రసాద్ రావు పర్యవేక్షణలో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తన సిబ్బందిని తీసుకెళ్లి తనిఖీలు చేపట్టారు. ఇందులో అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించడం, రికార్డులు లేని వాహనాలను సీజ్ చేయడం, నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టడం వంటి చర్యలు చేపట్టారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు కాలనీలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కలాపాలు చేపట్టినా, అనుమానిత వ్యక్తులు సంచరించినపుడు తమకు సమాచారం ఇవ్వాలని, నేర చరిత్ర కలిగిన వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చి ఆశ్రయం కల్పించడం వంటి పనులు ఎవరు చేసినా తమకు తెలపాలన్నారు. వేసవి కాలం కావడంతో ఎవరూ ఆరు బయట పడుకోవద్దని, విలువైన ఆభరణాలు ఒంటిపై వేసుకుని ఒంటరిగా తిరగవద్దని సూచించారు. అనుమానిత వాహనాలు ఎక్కడ కనిపించినా పోలీసులకు చెప్పాలన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పల్లెల్లో నివాసం ఉంటున్న వారు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రిపూట ఎవరు వచ్చి ఇంటి ముందు తలుపు తట్టినా, నీటి కొళాయిలు ఆన్ చేసినా వెంటనే తలుపు తీసి బయటకు రావద్దని, ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని, అనుమానంగా ఉంటే పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు రామకృష్ణ, షెక్షావలి, 30 మంది పోలీసు సిబ్బందితో పాటు స్పెషల్ పార్టీ బలగాలు పాల్గొన్నారు.

'స్కావెంజర్స్' జోలికి వస్తే యుద్ధమే!

- వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి నగర ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు నివసిస్తున్న స్కావెంజర్స్ కాలనీ జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న పారిశుద్ధ్య కార్మికులను ఇబ్బంది పెట్టాలని చూస్తే ఉద్యమం కాదని, యుద్ధమే చేస్తామని స్పష్టం చేశారు. నగర నడిబొడ్డులోని 4.61ఎకరాల విస్తీర్ణంలో స్కావెంజర్స్ కోసం కాలనీ ఏర్పాటు చేశారన్నారు. సుమారు 70 ఏళ్లుగా ఈ కాలనీలో పారిశుద్ధ్య కార్మికులు నివసిస్తున్నారని వెల్లడించారు. వీరికి అక్కడే శాశ్వతంగా ఇల్లు నిర్మించాలని గతంలో అనేక ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. అయితే 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి నారాయణ కుట్రపూరితంగా స్కావెంజర్స్‌కాలనీని ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు చర్యలు చేపట్టారని ఆరోపించారు. దీనిపై అప్పట్లోనే భూమన కరుణాకర రెడ్డితో పాటు వామపక్ష నాయకులు ఉద్యమాలు చేపట్టారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం 4.61ఎకరాల స్కావెంజర్స్‌కాలనీ విలువ సుమారు రూ. 120కోట్లకు చేరిందని తెలిపారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం దురాలోచనతో పారిశుద్ధ్య కార్మికులను తరిమేసి, స్కావెంజర్స్‌కాలనీని ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. అందులో భాగంగానే ఆ ప్రాంతంలో సర్వేలు చేపడుతోందన్నారు. తిరుపతిలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరిచేందుకు టీటీడీ సహకారంతో 1,700 మంది కార్మికులను అదనంగా తీసుకోవాలని నిర్ణయించామని, అప్పట్లో బీజేపీనేత భాను ప్రకాష్‌రెడ్డి కోర్టుకెళ్లి అడ్డుకున్నారని వెల్లడించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కార్మికులకు అన్యాయం జరుగుతుంటే భానుప్రకాష్‌రెడ్డి ఎందుకు కోర్టుకు వెళ్లలేదని ప్రశ్నించారు. స్కావెంజర్స్ కాలనీ నుంచి కార్మికులను తరిమేయాలని చూస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న చార్టెడ్ అకౌంటెంట్ ఫల్గుణ కుమార్

తిరుపతి కల్చరల్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌తో పాటు జీఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి పన్నులు చెల్లించడం ద్వారా అభివృద్ధి పథంలో పయనించవచ్చని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఫల్గుణ కుమార్ తెలిపారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో కేంద్ర బడ్జెట్‌లో వచ్చిన చట్టాలతో పాటు జీఎస్టీ చట్టాలపై వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాలను వ్యాపారులు ముందుగా అవగాహన చేసుకుని ప్రభుత్వానికి ఏవిధంగా పన్నులు చెల్లించాలో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారులు చట్టాల పట్ల అజాగ్రత్తలు తీసుకుంటే వారికి సమస్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాపార ఖర్చులలో జీతాల్లో కాంట్రాక్టు చెల్లింపులో రవాణా, అడ్వర్టైజ్‌మెంట్, కమీషన్లు, వృత్తి నైపుణ్యదారుల చెల్లింపులో కొన్ని పరిమితులకు లోబడి మూలంలోనే టీడీఎస్ పన్ను మినహాయించుకుని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కేవీ చౌదరి, కార్యదర్శి రఘురామిరెడ్డి, కోశాధికారి ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడు సుబ్బరామగుప్తా, రాజేంద్రన్, వెంకటేశ్వర్లు, బాలాజి, చంద్రశేఖర్, సురేష్, వ్యాపారులు పాల్గొన్నారు.

నివాళి



బొక్కిసం భాస్కర్ రెడ్డి కర్మక్రియలకు హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి రూరల్(రామచంద్రాపురం) : రామచంద్రాపురం చుట్టుగుంట రామాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొక్కిసం భాస్కర్ రెడ్డి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం ఆయన ఇంటి వద్ద జరిగిన కర్మక్రియలకు ఆ పార్టీ నేతలు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మేనమామ నల్లందుల సుధాకర్‌రెడ్డి కర్మక్రియలకు హాజరై కుటుంబీకులను ఓదార్చారు.

వ్యాసాశ్రమం అభివృద్ధికి కృషి



పూర్వ విద్యార్థుల సమావేశంలో ప్రముఖులు

తిరుపతి అర్బన్: ఏర్పేడులోని శ్రీవ్యాసాశ్రమం అభివృద్ధికి అండగా నిలుద్దామని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. తిరుపతి బైరాగిపట్టెడలోని జగ్జీవన్‌రావు భవనంలో ఆదివారం ఏర్పేడులోని శ్రీవ్యాసాశ్రమంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల అసోషియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ ఆశ్రమంలో ఆధ్యాత్మిక భావాలతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. గతంలో 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఆశ్రమంలో బాలురు, బాలికలు విద్యాభ్యాసం చేసుకునే వెసులుబాటు ఉండేదని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం 10 నుంచి ఇంటర్ వరకు కేవలం బాలికలు చదువుకోవడానికి మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. అయితే బాలబాలికలు 4వ తరగతి నుంచి చదువుకునేలా సౌకర్యాలను కల్పించడానికి కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది(2026) ఆశ్రమంలో శత జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారని చెప్పారు. అదే సందర్భంలో శ్రీమళయాళస్వామి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేద్దామని తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విఠపు బాలసుబ్రమణ్యం(మాజీ ఎమ్మెల్సీ), ప్రధాన కార్యదర్శి బలరామరాజు, సలహాదారుడు చెంగయ్య(మాజీ డీఈఓ), కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి హాజరయ్యారు.

నగరంలో నేటి కార్యక్రమాలు

- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం.
- ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేటీ రోడ్డులోని సప్తగిరినగర్, కమ్మ సంఘం హాల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమం.

చంద్రగిరి 'కూటమి'లో విభేదాలు



బోసిపోయిన ర్యాలీలో జనసేన ఎమ్మెల్యేలు, నేతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లోనే టీడీపీ, జనసేన, బీజేపీ నేతల్లో విభేదాలు మొదలయ్యాయి. ఆదివారం చంద్రగిరిలో జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో నేతల నడుమ పొరపొచ్చాలు బహిర్గతమయ్యాయి. చంద్రగిరి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. ఈ మేరకు కూటమి ప్రజాప్రతినిధులు, నేతలను ఆహ్వానించారు. ఈ మేరకు పట్టణంలో కూటమి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

8 గంటలకు అని చెప్పినా..!

పార్టీ కార్యాలయాన్ని ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు జనసేన నేతలు తొలుత ప్రకటించారు. అయితే మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా టీడీపీ, బీజేపీ నాయకులు కనిపించకపోవడంతో జనసేన నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక చేసేది లేక తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి కొత్తపేటలోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, కార్యాలయం ప్రారంభించారు.

ఇంటికెళ్లి పిలిచినా..!

జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి రావాలంటూ టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇంటికెళ్లి జనసేన నేతలు ఆహ్వానించినట్లు సమాచారం. అయినప్పటికీ ఆయన ముఖం చాటేయడంపై జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు.

దృఢ సంకల్పమే విజయానికి ఆయుధం



మాట్లాడుతున్న తూర్పుగోదావరి జిల్లా జేసీ, ఎస్వీయూ పూర్వ విద్యార్థి రాహుల్ కుమార్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ, ఈసీఈ విభాగం అధ్యాపకులు

- ఎస్వీయూ పూర్వ విద్యార్థి, ఈస్ట్ గోదావరి జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి
- ఎస్వీయూలో ఘనంగా సిగ్మాండ్-2025 ఫెస్ట్

తిరుపతి సిటీ : దృఢ సంకల్పం ఉంటే జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవచ్చని, దృఢ సంకల్పమే ఆయుధంగా ముందుకు సాగాలని ఎస్వీయూ పూర్వ విద్యార్థి, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సిగ్మండ్-2025 ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆయన వర్చువల్ విధానంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను ఎస్వీయూలో ఈసీఈ విభాగంలో 2012లో ఇంజినీరింగ్ పూర్తి చేశానని తెలిపారు. సివిల్స్ లక్ష్యంగా శ్రమించానని, పలు ప్రయత్నాల్లో విఫలమైనా ఆత్మ విశ్వాసాన్ని వదలలేదన్నారు. తర్వాత తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలకమన్నారు. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నిపుణులైన అధ్యాపకులకు కొదవలేదన్నారు. వారి సూచనల మేరకు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఐఏఎస్ అధికారి మాటలతో స్ఫూర్తి పొందిన విద్యార్థులు

తమ కళాశాలలో చదివి ఐఏఎస్‌గా ఎంపికైన రాహుల్ కుమార్‌రెడ్డి మాటలతో ఈసీఈ విభాగం విద్యార్థులు స్ఫూర్తి పొందారు. ఆయన విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సావధానంగా సమాధానం ఇచ్చారు. సందేహాలను నివృత్తి చేశారు. విఫలం చెందామని నిరుత్సాహపడకుండా ముందుకు సాగితే లక్ష్యం కాళ్ల వద్దకు చేరుతుందన్నారు. సివిల్స్ కష్టసాధ్యమైన పరీక్ష అంటూ సమాజంలో ఎంతో మంది వెనుకడుగు వేస్తారని, అది సత్యదూరమన్నారు.

ఎస్వీయూ విద్యార్థి ఐఏఎస్ సాధించడం గర్వకారణం

వీసీ అప్పారావు మాట్లాడుతూ ఎస్వీయూ ఈసీఈ విభాగం పూర్వ విద్యార్థి రాహుల్ కుమార్‌రెడ్డి ఐఏఎస్ సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఈసీఈ విభాగం హెడ్ స్వర్ణలత, కన్వీనర్ ప్రొఫెసర్ వరదరాజన్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ రామ్ హర్షన్, వర్షిత, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్: నగరంలోని శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఈనెల 25వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయంలో ఈనెల 27 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా 25న తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది.

బైక్ బోల్తాపడి ఉపాధ్యాయుడి మృతి



శివకేశవులు (ఫైల్)

రామచంద్రాపురం (తిరుపతి రూరల్): రామచంద్రాపురం మండలంలోని చిట్టతూరు సమీపంలో శనివారం రాత్రి బైక్ బోల్తాపడి ఉపాధ్యాయుడు శివకేశవులు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. శివకేశవులు కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన శనివారం రాత్రి బైక్‌లో పచ్చికాపలం నుంచి స్వగ్రామమైన చిట్టతూరు గ్రామానికి బయలుదేరారు. చిట్టత్తూరు సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. తలకు బలమైన గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. శివకేశవులు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హిందీ టీచర్ మృతి విషయం తెలుసుకున్న కమ్మపల్లి జెడ్పీ హైస్కూల్ పిల్లలు పెద్ద సంఖ్యలో చిట్టత్తూరు చేరుకున్నారు. ఆయన భౌతిక దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భగత్‌సింగ్‌కు నివాళి



మాట్లాడుతున్న సాకం నాగరాజు

తిరుపతి సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎస్వీయూలో ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

విద్యార్థులు దేభక్తిని అలవర్చుకోవాలి

తిరుపతి కల్చరల్: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులంతా దేశభక్తి భావాలను అలవర్చుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఆదివారం భగత్‌సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు.

విద్యావ్యవస్థలో రామ్మూర్తి సేవలు ఆదర్శనీయం



హెచ్‌ఎం రామ్మూర్తి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చంద్రగిరి: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలకమైన విద్యావ్యవస్థలో హెచ్‌ఎం రామ్మూర్తి అందించిన సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. మండల పరిధిలోని నరసింగాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామ్మూర్తి ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్దఎత్తున హాజరయ్యారు. ముందుగా హెచ్‌ఎం రామ్మూర్తి దంపతులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడంతో పాటు సైన్సు పట్ల విద్యార్థులకు మరింత ఆసక్తి కలిగేలా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు వారిని సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

చిన్నారుల అప్పగింత





చిన్నారులను అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల: తిరుమలలో తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను అర గంట వ్యవధిలోనే పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. శనివారం రాత్రి తిరుమలలో కర్నూలు జిల్లా, పెద్దకడబూరు మండలం, భాపురం కంపాడుకు చెందిన వీరేష్(6) అన్నదాన సత్రం వద్ద, కర్ణాటక రాష్ట్రం, యాదగిరి జిల్లా, సోలాపూర్ తాలూకా, యాలగి గ్రామానికి చెందిన చంచన(8) నాదనీరాజనం వద్ద తప్పిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టారు. చాకచక్యంగా చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

టేప్ నూతన కమిటీ ఎంపిక



అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్, ఇంజినీర్స్ నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజినీర్స్(టేప్) నూతన కమిటీని ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా టి.వెంకటేష్‌బాబు, అధ్యక్షుడిగా ఎం.ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.నాగేశ్వరరావు, ఎ.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా బి.షణ్ముగం, కోశాధికారిగా సందీప్, సహాయ కార్యదర్శులుగా శివశంకర్‌రెడ్డి, బంగారయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నరేష్, వెల్ఫేర్ కార్యదర్శిగా సురేష్‌బాబుతో పాటు 9 మంది కమిటీ సభ్యులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జూలై 12,13 తేదీల్లో పీఎల్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న టేప్ ఎక్స్‌పో-2025 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి దర్పణం.. సాంస్కృతికం



నృత్య ప్రదర్శన చేస్తున్న ఎస్వీ చిల్డ్రన్స్ స్కూల్ చిన్నారులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీవేంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ 48వ వార్షికోత్సవంలో చిన్నారులు తమ సాంస్కృతిక ప్రదర్శనలతో భారతీయ సంస్కృతి, సంప్రదాయం, దేశభక్తిని ఆవిష్కరించి అలరింపజేశారు. తమదైన నృత్యాలతో దేశభక్తి, దైవభక్తి, గురుభక్తి, తల్లిదండ్రులపై భక్తి, సత్ప్రవర్తన వంటి వాటిని చాటుతూ అద్వితీయంగా నృత్యం, నాటక రూపాల్లో అభినయించి సభికుల హర్షధ్వానాలు అందుకున్నారు. నవదుర్గ రూపంలో పిల్లలు చేసిన నృత్యరూపకం దైవత్వాన్ని చాటుతూ సభికులను తన్మయత్వంతో ముంచెత్తారు. శ్రీవేంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ చైర్మన్ కేఎస్ వాసు రంగోత్సవం-2025 పేరుతో పాఠశాల వార్షికోత్సవాన్ని అద్భుతంగా ప్రదర్శింపజేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రైమరీ హెచ్‌ఎం మాధవి, పబ్లిక్ రిలేషన్ మేనేజర్ ఈశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈద్గా నూతన కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: ఈద్గా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ రఫీ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నూతన కమిటీని ప్రకటించారు. ఈద్గా కమిటీ గౌరవాధ్యక్షులుగా ఎస్‌కే బాబు, ఎస్.ఖాజీ మొహిద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎస్.సబుద్దీన్, ఎస్.హరున్‌బాషా, అమీర్ ఖాన్, మహ్మద్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా కె.ఇక్బాల్ బాషా, కార్యదర్శులుగా అబ్దుల్ మునాఫ్, అహ్మద్‌బాషా, సహాయ కార్యదర్శులుగా శర్ఫునుద్దీన్, సిరాజ్, పీఎస్ సుభాహాని, కోశాధికారిగా శామ్‌బాషాతో పాటు ఏడుగురు కమిటీ సభ్యులను నియమించినట్లు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో ఈద్గా నూతన కమిటీతో పాటు ముతవల్లీలు ఇస్మాయిల్, మహ్మద్ అలీ పాల్గొన్నారు.

ఆద్యంతం.. ఆసక్తికరం.. ఉగాది కవి సమ్మేళనం



ఉగాది కవి సమ్మేళనంలో కవిత చదువుతున్న రచయిత్రి శశికళ

తిరుపతి కల్చరల్: ఉగాది ప్రాశస్త్యాన్ని ఆవిష్కరిస్తూ కవులు ఆలపించిన కవితలు, పద్యాలు, గేయాలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ ఆకట్టుకున్నాయి. తిరుపతి తెలుగు సంఘాల ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని చాంపర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు గార్లపాటి దామోదర నాయుడు ఆధ్వర్యంలో కార్యనిర్వాహక కార్యదర్శి తోట వెంకటేశ్వర్లు నిర్వహణలో సాగిన ఈ కవి సమ్మేళనంలో 50 మంది కవులు పాల్గొని వారి కవితలు వినిపించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా శతావధాని ఆముదాల మురళి, ఆకుల మల్లేశ్వరరావు, అంకమనాయుడు వ్యవహరించారు. ఈ కవి సమ్మేళనంలో ఐదు కవితలను ఎంపిక చేసి వారికి ఉగాది వేడుకల రోజున ఘనంగా సత్కరించనున్నారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.